క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించాలి


విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నాయకులు

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని మున్సిపాలిటీ బీజేవైఎం నాయకుడు వేణు కోరారు. సోమవారం మున్సిపాలిటీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులను కలిసి పాఠశాల సదుపాయాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యతో పాటు, భోజనం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాకేశ్, రాజ్‌కుమార్, వర్ధన్, సతీష్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

రేపు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కందుకూరు: మండల పరిధిలోని లబ్ధిదారులకు ఈ నెల 23వ తేదీన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ గోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. తెలిపారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సమావేశం హాల్‌లో 64 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేయనుందని వెల్లడించారు. లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సకాలంలో హాజరుకావాలని తహసీల్దార్ కోరారు.

ఎల్‌ఓసీ అందజేత

కడ్తాల్: మండల పరిధి చరికొండ గ్రామానికి చెందిన మహ్మద్ హుస్సేన్ ఆరోగ్య సమస్యలతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో.. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్.. సమస్యను ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్సీ సహకారంతో, హుస్సేన్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2 లక్షల ఎల్‌ఓసీ చెక్కు మంజూరు కాగా.. సోమవారం నిమ్స్‌లో బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహాగౌడ్ తదితరులు ఉన్నారు.

10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు

తలకొండపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 50 వేల ఉద్యోగాలు ఇచ్చిందని ఆ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదికి 2 కోట్ల కొలువులు ఇస్తామని చెప్పిన ప్రధాని మోదీ.. వాటి విషయం ఏమైందని ప్రశ్నించారు.

అధికారం కోల్పోయాక గుర్తుకొచ్చామా?

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో అధికారం కోల్పోయాక మాజీ మంత్రి కేటీఆర్‌కు కమ్యూనిస్టులు గుర్తుకొచ్చారా అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.సామెల్ సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం మండలంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఆదివారం నిర్వహించిన దసరా సమ్మేళనానికి హాజరైన కేటీఆర్.. తన ప్రసంగంలో పోరాడ వలసిన కమ్యూనిస్టులు ఎక్కడ అని ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. కమ్యూనిస్టుల పోరాటంతో సాధించుకున్న అసైన్డ్ తదితర భూములతో పేదలు జీవనోపాధి పొందుతుంటే.. ఎస్సీ,ఎస్టీ,బీసీ పేద రైతుల పేర్లను ధరణిలో తొలగించి, రైతుబంధు రాకుండా చేసింది మీ ప్రభుత్వమే కదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. దీంతో ఎంతో మంది పేద రైతులు ఆందోళనకు గురై.. మృత్యువాత పడితే రైతుబీమా కూడా నోచుకోలేని దుస్థితిని కల్పించింది కూడా మీ సర్కారేనని గుర్తుచేశారు. ఫార్మాసిటీ పేరుతో యాచారం, కందుకూరు మండలాల్లో 19 వేల ఎకరాల రైతుల భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొల్లగొడుతున్న సందర్భంలో రైతులకు అండగా.. నిలబడింది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. ఆరోపణలు చేసేముందు మీ తప్పులను తెలుసుకోవాలని కేటీఆర్‌కు సూచించారు.

రక్తదానంతో ప్రాణదానం

ఆమనగల్లు: రక్తదానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని ఎస్‌ఐ వెంకటేశ్ అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు శాఖ, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఎస్‌ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన యువతీ యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. ప్రజల్లో రక్తదానంపై ఉన్న అపోహలను పోగొట్టడానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో 25 మంది రక్తదానం చేశారు. లయన్స్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాష, జిల్లా చైర్మన్‌లు రమేశ్, చంద్రశేఖర్, యాదయ్య, సభ్యులు మహేశ్ పాల్గొన్నారు.

ఆ ఇంట కొలువుల పంట

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం రావడమే గొప్ప అనుకుంటాం. కానీ ఆ ఇంట్లో ఒకరిద్దరు కాదు ఏకంగా ముగ్గురు ఆడ పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరొకరు గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. కన్నవారి తపనను దగ్గరుండి గమనించిన ఆ సరస్వతీ పుత్రికలు.. ఆహర్నిశలు శ్రమించి, సర్కారు కొలువులను సాధించారు.

- నలుగురు ఆడబిడ్డల్లో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు
- మరొకరు గ్రూప్ పరీక్షలకు సన్నద్ధం
- ప్రోత్సహించిన తల్లిదండ్రులు..
- పోటీ ప్రపంచాన్ని ఎదురీదిన అక్కాచెల్లెల్లు
- హర్షం వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు


నలుగురు కూతుర్లతో దంపతులు బాల్‌రాజ్, భారతమ్మ

మహేశ్వరం: ఆడపిల్ల పుడితే అయ్యో దేవుడా ఎట్లా అనుకునే రోజుల్లో.. ఏకంగా నలుగురు బిడ్డలను కన్న ఆ దంపతులు.. అధైర్య పడలేదు. భారంగా భావించకుండా బాధ్యతగా పెంచి పెద్ద చేశారు. అందిరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దారు. జీవితంలో స్థిరపడేలా చేశారు. మండల పరిధి హబీబుల్లాగూడ(పులిమక్త) గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన వెంకన్నగూడకు చెందిన బండారి బాల్‌రాజ్– భారతమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు. వీరిది నిరుపేద కుటుంబం. తనకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారి పుత్రికలు అయిన అలివేలు, పుణ్య, యమున, గంగలను ఎంతో చెమటోడ్చి చదవించారు. వారి ప్రోత్సాహంతో కూతుర్లు ఉన్నత విద్యను అభ్యసించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఒడిసి పడుతున్నారు. ఇప్పటికే ముగ్గులు కొలువులు చేస్తుండగా.. మరొకరు గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమువుతున్నారు.


అలివేలు (పెద్ద కుమార్తె) కానిస్టేబుల్


పుణ్య, (మూడో తనయ), స్టాఫ్‌నర్స్


యమున (చిన్న కూతురు), టీచర్


గంగ (రెండో కూతురు) గ్రూప్‌నకు సన్నద్ధం

నర్సు, పోలీస్, టీచర్, మరొకరు..?

పెద్ద కూతురు అలివేలు పీజీ ఎమ్మెస్సీ పూర్తిచేసి పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. మూడో కూమార్తె పుణ్య బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, హైదరాబాద్ జెజ్జిఖానా ప్రసూతి ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగో కూమార్తె యమున డీఈడీ పూర్తి చేసి, ఇటీవల డీఎస్సీ పరీక్ష రాసి ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిమాయక పత్రం అందుకున్నారు. రెండో అమ్మాయి గంగ బీటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. గంగ భర్త అల్లాజీ.. కడ్తాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. త్వరలో తాను కూడా ప్రభుత్వ ఉద్యోగం సాధించి, కన్నవారి కలలను సాకారం చేస్తానని గంగ స్పష్టంచేస్తున్నారు. ఇలా పేద దంపతుల కూతుర్లు నలుగురు ఉన్నత స్థానంలో నిలబడటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నా కలలను నిజం చేశారు

నలుగురు కూతుర్లు ఉన్నారని బాధపడకుండా.. బాధ్యతగా చదివించాను. ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మరొకరు గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. నా కలలను నా బిడ్డలు నిజం చేయడంతో గర్వంగా ఉంది. వారి చదువు విషయంలో వెనకాడకుండా వెన్నుతట్టాను. తమ కష్టాన్ని చూసిన వారికి.. చెమటోడుస్తేనే ఫలితం లభిస్తుందనే నమ్మకం కలిగింది. ఆ దిశగా పయనించి.. లక్ష్యం చేరుకున్నారు.

– బాల్‌రాజ్, యువతుల తండ్రి


శబరిమలకు మహాపాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప భక్తులు

శబరిమలకు మహా పాదయాత్ర

మహేశ్వరం: మండల పరిధి తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల గ్రామంతో పాటు మహేశ్వరం మండల పరిధి గ్రామాల అయ్యప్ప భక్తులు శబరిమలకు మహా పాదయాత్రగా సోమవారం బయలుదేరారు. రావిర్యాల గ్రామంలో హరిహర అయ్యప్పస్వామి సన్నిధానంలో యాత్రకు బయలుదేరే భక్తులు గురుస్వాములు నరాల శేఖర్, నక్క గోవర్ధన్, గద్దగూటి వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో ఇరుముడి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, అమృతాభిషేకంతో పాటు పలు పూజలు భక్తులు నిర్వహించారు. మహేశ్వరం మండలం, ఇబ్రాహీంపట్నం, కందుకూరు మండలాలతో పాటు హైదరాబాద్ నుంచి 105 మంది అయ్యప్ప భక్తులు ఇరుముడులతో శబరిమలకు బయలుదేశారు. కార్యక్రమంలో రావిర్యాల అయ్యప్పస్వామి సన్నిధానం కమిటీ అధ్యక్షుడు ఆకుల రమేశ్‌ముదిరాజ్, అయ్యప్ప గురుస్వాములు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి, కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: బీరప్ప కాలనీలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో బీరప్పస్వామి కామరాతిదేవి విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు, పట్టణ పెద్దలు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. విచ్చేసిన ముఖ్యులను పెద్దకురుమ గౌర సత్యనారాయణ, సాయి, గౌర శ్రీనివాస్, దొడ్డి మల్లికార్జున, కురుమపెద్దలు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.


మాట్లాడుతున్న రవీంద్రాచారి

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి

మీర్‌పేట: రాష్ట్రంలోని రైతులకు షరతులు లేకుండా సంపూర్ణంగా రైతు రుణమాఫీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మీర్‌పేట లెనిన్‌నగర్‌లో జరిగిన పార్టీ బాలాపూర్ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి రవీంద్రాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావొస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ప్రభుత్వం రుణమాఫీ పూర్తిగా చేయలేదని, ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వం వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. దీంతో పాటు రైతు భరోసా ఎకరాకు రూ.7500 ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల పోరాటాన్ని అణిచివేయడంతో పాటు వేలాది మంది రైతులు ప్రాణాలు కోల్పోయేందుకు కారణమైందని ఆరోపించారు. రైతుల సమస్యలపై రైతు సంఘం నిరంతరం పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శివనాయక్, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి యాదమ్మయాదవ్, గిరిజన సమాఖ్య జిల్లా కోశాధికారి ఛత్రునాయక్, మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, పిచ్చిరాజు పాల్గొన్నారు. అనంతరం నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నా రు. మండల అధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా అంజయ్య, ఉపాధ్యక్షుడిగా రామస్వామి, సహాయ కార్యదర్శిగా బాబ య్య, కార్యవర్గ సభ్యులుగా శ్రీను, విజయ్‌కుమార్, కౌన్సిల్ సభ్యులుగా రజియాబేగంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కలవరపెడుతున్న కల్వర్టులు

- జల్‌పల్లి కమాన్ రోడ్డులో బీటలువారిన వంతెన
- ఆందోళనలో వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు


జల్‌పల్లికమాన్ రోడ్డులో బీటలువారిన వంతెన


శ్రీరాం కాలనీలో ధ్వంసమైన కల్వర్టు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని ప్రధాన రహదారులపై ఉన్న కల్వర్టు(వంతెన)లు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదాలకు నిలయంగా మారాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ కల్వర్టులు కూలిపోయే స్థితికి చేరుకోవడంతో వాహనదారులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీరాం కాలనీలోని భారతమాత విగ్రహ సమీపంలోని కల్వర్టు సగం మేర కూలి ఇప్పటికే ప్రమాదభరితంగా మారగా.. తాజాగా జల్‌పల్లి కమాన్ రోడ్డులో చెరువు వద్ద కల్వర్టు పగుళ్లు ఏర్పడడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు ఈ కల్వర్టు పైనుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. శిథిల వంతెనలతో ఒక్కోసారి అధికారులు రోడ్లను మూసివేస్తున్న కారణంగా ప్రత్యామ్నాయంగా సుదూర ప్రయాణం చేయాల్సి వస్తుందని వాహనదారులు పేర్కొంటున్నారు.

వర్షాకాలం వచ్చిందంటే అంతే సంగతులు.

కమాన్ రోడ్డులోని కల్వర్టు పూర్తిగా శిథిలంగా కాగా.. వర్షాకాలంలో నెలల తరబడి పోలీసు అధికారులు ముందు జాగ్రత్తగా ఈ రూట్‌లో వాహనాల రాకపోకలను నిలిపివేయిస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు ప్రతి వర్షాకాలంలో ఈ రోడ్డును మూసివేశారు. పాత రోడ్డు పైనుంచి సీసీరోడ్డు వేయడంతో బ్రిడ్జి పటిష్టంగానే ఉందని రెండేళ్లుగా భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. కాని ప్రస్తుతం సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

బుట్ట దాఖలుగానే ప్రతిపాదనలు..

జల్‌పల్లి కమాన్ రోడ్డులోని చెరువు వద్ద పూర్తిగా శిథిలమైన కల్వర్టు స్థానంలో కొత్తది నిర్మించాలని అధికారులు చేస్తున్న ప్రతిపాదనలు బుట్టదాఖలు అవుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారులు పలుమార్లు కొలతలు తీసుకున్నా పనులు ముందుకు సాగలేదు. వీటితో పాటు జల్‌పల్లి కార్గో రోడ్డు నుంచి మామిడిపల్లి బాలాజీనగర్‌కు వెళ్లే దారిలో కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోవడంతో మూడేళ్లకు పైగా రాకపోకలు సాగించాయి. ఇప్పుడు బాలాజీ ఆలయ రహదారిలోని కల్వర్ట్ కూడా శిథిలావస్థకు చేరుకొని, ప్రమాదకరంగానే తయారైంది.

హిందువుల జోలికి వస్తే సహించం

- ఆలయ ఆవరణలో మేకను బలిచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్


హిందూ సంఘాల నేతలతో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ వెంకటసత్యనారాయణ

మహేశ్వరం: ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయ ఆవరణలో మేకను బలి ఇచ్చిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామంలో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఓ వర్గానికి చెందిన దర్గా వద్ద గుర్తు తెలియని వ్యక్తి మేకను బలి ఇచ్చి, ఆలయాన్ని అపవిత్రం చేశారని పేర్కొన్నారు. హిందువులు పవిత్రంగా కొలిచే ఆలయాల జోలికి వస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఆలయ చైర్మన్, ఈఓ, సిబ్బంది వెంటనే రాజీనామా చేయాలన్నారు. మంగళవారం ఉదయం 7 గంటలకు హిందూ బంధువులతో అంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, హారతి పూజా కార్యక్రమాలు చేపడుతామన్నారు. అంతకుముందు బీజేపీ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, హిందూవాహిని సంఘాలు వీరాంజనేయ స్వామి ఆలయానికి చేరుకొని ఆలయ ఆవరణలో మేకను బలిచ్చిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నిరసన చేపట్టడంతో అడిషనల్ డీసీపీ వెంకటసత్యనారాయణ, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు కలుగజేసుకొని నిరసన చేస్తున్న వారిని సముదాయించారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో నిరసన విరమింపజేశారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, హిందూ వాహిని, ఆర్‌ఎస్‌ఎస్ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను దగా చేసిన ప్రభుత్వం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మాడ్గుల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్ రెడ్డి ఆరోపించారు. సోమవారం వారు అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ రైతుభరోసా ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. భరోసాతో పాటు అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లాలయ్య గౌడ్, జైపాల్ నాయక్, శంకర్ నాయక్, పవన్ కుమార్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, యాదయ్య, విజయ్ ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

యాచారం: స్నేహితురాలి కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. ఆర్థిక సహాయం అందజేసి మేమున్నామని భరోసా కల్పించారు. మండల పరిధి నందివనపర్తి ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి బ్యాచ్‌నకు చెందిన జలజ భర్త నందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంటి పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న జలజ.. చిననాటి స్నేహితులు సోమవారం రూ.50 వేలను ఆమెకు అందజేశారు.

పశువులకు గాలికుంటు టీకా తప్పనిసరి


ఆవుకు టీకా ఇస్తున్న డాక్టర్ అగ్నివేష్

ఆమనగల్లు: పాడి పశువులకు రైతులు విధిగా గాలికుంటు నివారణ టీకాలు ఇప్పించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ అగ్నివేష్ అన్నారు. మండల పరిధి పోలెపల్లి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం 326 ఆవులు, 12 పాడి పశువులకు టీకాలు ఇచ్చినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సులేమాన్, యాదయ్య, బురానొద్దీన్, పాలాక్ష, గోపాలమిత్రలు హరీశ్, రమేశ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- రూ.300 కోట్లకు పైగా నిధులు మంజూరు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మహిళలకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కడ్తాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ ముంతాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 64 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.

పది నెలల కాలంలో..

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్టీసీ ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్, రూ.500లకు వంట గ్యాస్, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీని పెంచిందని వెల్లడించారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా పథకాలతో రైతులకు అండగా నిలిచిందని తెలిపారు. పది నెలల కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.300 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించానని వెల్లడించారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

అభివృద్ధి చూసి ఓర్వని జైపాల్

ఏ పార్టీలో ఉన్నా ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసమే పనిచేశానని, అది చూసి ఓర్వలేని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన మూడు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా ఉండి చేయని అభివృద్ధి పనులను.. కేవలం 10 నెలల్లోనే చేశానని, ఇంకా చేస్తానని కసిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386